





రోజూలానే ఆ రోజూ పార్కుకి వెళ్ళాను.

రోజూ కూర్చునే ఉత్తరంవైపు చింత చెట్టుకింద బెంచీమీద కూర్చున్నాను. రోజూలానే జ్యోతిష్యం చెప్పే చెయిన్లు బెంచీ బెంచీకి తిరుగుతూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్న జంటల్ని, యువకుల్ని 'డిస్టర్బ్' చేస్తున్నాడు.

పార్కుకి వచ్చాక నాకు రోజూ అతన్ని చూడటం ఒక అలవాటయిపోయింది. పార్కులోని ప్రతిమనిషి దగ్గరకూ తిరుగుతుంటాడు. కొంత మంది హేళనగా మాట్లాడతారు. కొంత మంది కోపంగా పొమ్మంటారు. కొంత మంది అసలు పట్టించుకోరు. అయినా చెయిన్లు ముఖంలో బాధ, కోపం లాంటివెప్పుడూ నేను చూడలేదు. అందుకే నాకు అంటే సానుభూతి.

మొదట్లో నేనూ అతన్ని హేళనగా మాట్లాడాను. అయితే మాటకారి తనం, అతని ముఖంలోని చిరునవ్వు నన్ను మార్చివేశాయి. అంతే కాదు; మా యిద్ద నాకూ మంచి స్నేహం ఏర్పడింది. మా ఇదరి పేర్లూ ఒకటేగని, మా వృత్తులు, అభిరుచులు అన్నీ వేరు. అయినా మా స్నేహం ఆశ్చర్యకరంగా వృద్ధి చెందింది.

నేను ఆఫీసునుంచి ఐదున్నరకల్లా పార్కుకి వస్తాను. సాధారణంగా జనం పార్కుకి చేరే సమయం కూడా అదే. చెయిన్లు కూడా అదే టైముకి పార్కుకు చేరతాడు.

నాకు జ్యోతిష్యం మీద నమ్మకం లేదు. చెయిన్లుకు తన వృత్తిమీద తనకెంతో గౌరవం. పవిత్ర భావమూను. ఇప్పటికి కూడా జ్యోతిష్యాన్ని వేళాకోళం చేసుంటాను. అయినా అతనేం బాధపడడు. కానీ అప్పుడప్పుడూ నన్ను జ్యోతిష్యం మీద నమ్మకం కలవాడిగా చేయడానికి, జ్యోతిష్యం చెప్పిన కొన్ని గొప్ప నిజాలను నాకు ఉదహరిస్తాడు. కానీ నాపట్ల ఎప్పుడూ జ్యోతిషం నిజం కాలేదుగనుక నేనూ సోదాహరణంగా కొట్టిపారేస్తాను. అంతెందుకు! అతనే నాకు చెప్పిన జ్యోతిష్యాలు నిజం కాలేదు.

ఆ రోజు వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు. ఏదో చెప్పబోతున్నాడు. ఇంతలో చెయిన్లు రెండో కొడుకు వచ్చి—"నాన్నా అమ్మ చచ్చిపోయింది" అనే కబురు అందించాడు! కొన్ని క్షణాలు చెయిన్లతో పాటు నేనూ చలన రహితుడనైపోయాను.

చెయిన్ల భార్య చాల గుట్టుగా సంసారాన్ని నడిపే ఆదర్శగృహిణి. ముగ్గురు పిల్లలు. సంపాదన రోజుకు ఐదు రూపాయలకు తక్కువ కాకుండా పది రూపాయలకు మించకుండా వుంటుంది. ఈ సంపాదనతో ఆ సంసారం ఇంతటి పట్టణంలో ఎలా నెట్టుకొసుందో అర్థం కానివిషయం. దీనికి సంసారంలోని భర్త కంటే భార్య తెలివితేటలే అవసరం. అలాంటి భార్య చెయిన్లకు దూరమైపోయింది.

ఇంతమంది భావిని చెప్పే తను, తన భవిష్యతును- భార్య మరణాన్ని ఎందుకు ఊహించలేకపోయాడు?!

చెయిన్ల ఆలోచనలతో నేఇంటికి చేరాను. నా భార్య కార్డొకటి తెచ్చి అందించింది. "మా అమ్మ చనిపోయింది!"- ఇదీ వార్త.

కొన్నిరోజుల క్రితం చెయిన్లు—"ఇవాళో, రేపో నువ్వొక దుర్వార్త వింటావు" అన్న మాటలు గుర్తుకొచ్చాయి. అయితే ఆ వార్తను కాస్త ఆలస్యంగా విన్నాను.

చెయిన్ల పేరూ, నా పేరూ ఒకటే కనుక అతను కూడా ఆ దుర్వార్తను అందుకున్నాడా? అయితే తన భవిష్యతును తానెందుకు ముందుగా చూసుకోలేకపోయాడు? ★

## రసగుళిక

### ఓవర్ టైం

విల్సన్ బారెట్ అనే ప్రఖ్యాత రంగస్థల నటుడు లండన్‌లోని తన యింటిని రీ మోడల్ చేసి అలంకరించడానికి కొంత మంది పనివారిని నియమించాడు. ఆ సమయంలో లండన్‌లోని "ప్రిన్సెస్ థియేటర్"లో అతడు నటిస్తున్న "ది లైట్స్ ఆఫ్ లండన్" అన్న నాటకం ప్రదర్శింపబడుతోంది. తన యింటిని రీ మోడల్ చేసి అలంకరిస్తున్న పనివారికి వినోదం కలిగించాలనుకొని "మీరు నా నాటకం చూసేటట్లయితే, మీకు కావలసిన కాంప్లిమెంటరీ టికెట్లు పంపిస్తాను." అని అన్నాడు. వారు "అలాగే పంపించండి." అని అన్నారు.

వారం పూర్తి అయిన తరువాత వారు బారెట్‌కు సమర్పించిన పే షీట్స్‌లో "బుధవారం రాత్రి ప్రిన్సెస్ థియేటర్ వద్ద చేసిన ఓవర్ టైమ్‌కుగాను ఎనిమిది షిల్లింగులు" అని వ్రాసి ఉంది. అది చూసి బారెట్ అవాక్కయిపోయాడు.

—బి. శ్రీనివాసులురెడ్డి